

# ప్రశాంతతకు ప్రతీక రాయచోటి

**- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**



**ప్రజాశక్తి-రాయచోటి**

మత సామరస్యానికి, ప్రశాంతతకు ప్రతీక రాయచోటి అని, మత విద్వేషాలకు అతీతంగా సామరస్యం, సోదరభావంతో ప్రతి ఒక్కరూ మెలగాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజలకు పిలుపు నిచ్చారు. రాయచోటి పట్టణంలో మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఘటన బాధాకరమని పేర్కొన్నారు. కొంత మంది ఆకతాయిలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడమే కాకుండా ఇతరులకు అసౌకర్యం కలిగించడం విచారకరమని తెలిపారు. శాంతియుతంగా కార్యక్రమాలు జరుపుకోవాలే తప్ప రెచ్చగొట్టే విధానాలతో ఇతరులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు పోలీసులు సమన్వయంతో సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రజలందరూ సామరస్యంతో మెలగాలని కోరారు. ఇరు వర్గాలకు చెందిన కొంత మంది ఆకతాయిలు అసంబద్ధమైన నినాదాలతో రెచ్చగొట్టి దాడికి పాల్పడడం మంచిది కాదన్నారు. ఎప్పటికప్పుడూ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడుతూ ఎవరికీ ఇబ్బంది కల్గకుండా చూడాలని ఆదేశించామన్నారు కొంత మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నిష్పక్షపాతంగా ప్రశాంత వాతావరణం కోసం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించామని పేర్కొన్నారు. ప్రస్తుతం రాయచోటి పట్టణంలో ప్రశాంత వాతావరణం ఉందన్నారు. ఈ పరిస్థితిని చెడగొట్టడానికి కొంత మంది సత్యదూరం, అసంబద్ధమైన పుకార్లను వ్యాప్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు ప్రత్యేకమైన నిఘా పెట్టి పరిస్థితిని ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రజలుఎలాంటి పుకార్లను, వదంతులను నమ్మవద్దని తెలిపారు. ఒకరి మనోభావాలను మరొకరు గౌరవించాలన్నారు. అందరూ చట్ట పరిధిలో వ్యవహరించి రాయచోటి ప్రతిష్టను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

**అన్నదమ్ములా కలసి మెలసి నడవాలి :** పట్టణంలో హిందూ, ముస్లిం సోదరులు భాయి భాయి అంటూ కలసి మెలసి ఉండాలని టిడిపి పట్టణ అధ్యక్షులు భోనమల ఖాదర్‌వలి పేర్కొన్నారు. తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలో మంగళవారం రాత్రి జరిగిన శ్రీ వీరభద్రస్వామి పార్వేటి ఉత్సవంలో చోటు చేసుకున్న సంఘటన చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు జూల్ఫకీర్, మస్తాన్, ఖాదర్ బాష పాల్గొన్నారు.

**మతసామరస్యానికి ప్రతీక : మున్సిపల్ చైర్మన్**

**రాయచోటి టౌన్ :** అన్నమయ్య జిల్లా కేంద్రం ప్రశాంతతకు, మత సామరస్యానికి ప్రతీకగా ఉందిని మత విద్వేషాలకు అతీతంగా సోదర భావంతో సామరస్యంగా ప్రతి ఒక్కరూ కలసి మెలసి ఉందామని రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం చోటు చేసుకున్న సంఘటన పట్ల చైర్మన్ స్పందించారు. ప్రశాంతంగా జీవనం సాగిస్తున్న పట్టణ ప్రజల మధ్య చిచ్చు పెట్టాలన్న కొంత మంది ఆకతాయిల చర్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని పేర్కొన్నారు.


# వామ్మో.. విద్యుత్ ఛార్జీలు!




- హడలెత్తిస్తున్న 'ఎఫ్‌పిపిసిఎ'
- 4 నెలల నుంచి అదనపు మోతతో జనం బెంబేలు
- దిక్కుతోచని స్థితిలో విద్యుత్ వినియోగదారులు

**ప్రజాశక్తి - పులివెందులటౌన్**

విద్యుత్ ఛార్జీల భారం మోయలేక జనం అల్లాడి పోతున్నారు. నాలుగు నెల నుంచి ఎఫ్‌టిపిసిఎ ఛార్జీలతో జనం హడలెత్తిపోతున్నారు. విద్యుత్ ఛార్జీల పెరుగుదలతో వినియోగదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. గత ప్రభుత్వం తప్పిదమంటూ కూటమి ప్రభుత్వం తప్పించుకునే పనిలో పడగా, ఈ భారమంతా కూటమి ప్రభుత్వానిదేనంటూ వైసిపి తీవ్ర విమర్శలు చేసుకుంటూ జనాల నెత్తిన భారాలు మోపి ఇరుపార్టీలు వికటాట్టహాసం చేస్తున్న పరిస్థితి నెలకొంది. వాడుకున్న విద్యుత్‌కు వస్తున్న కరెంటు బిల్లులకు ఏమాత్రమూ సంబంధం లేకుండా జనాలు లబోదిబోమంటున్న పరిస్థితి ఏర్పడింది. రూ.675 కరెంటు బిల్లులో ఫిక్స్‌డ్ ఛార్జీలు రూ .30, కస్టమర్ ఛార్జీలు రూ .45, ఎఫ్‌పిపిసిఎ రూ.238 (వై 22. 6.8), ఎఫ్‌పిపిసిఎ. రూ . 35 ( 2023, 06), ఎఫ్‌పిపిసిఎ. రూ . 26 (2025. 02), ట్రూ ఆప్ ఛార్జీలు రూ. 39 ఇలా అదనపు ఛార్జీల భారం రూ.420 ఉన్న పరిస్థితి నెలకొంది. 80 యూనిట్లకు బిల్లు రూ. 255 బిల్లు వస్తే అదనపు ఛార్జీలు రూ .420 జనం నెత్తిన రుద్దిన దుస్థితి కొనసాగుతోంది. జిల్లాలో 12 లక్షలకు పైగా విద్యుత్ కనెక్ష న్లు న్నాయి. వీటిలో మూడొంతుల విద్యుత్ కనెక్షన్లు సామాన్య ప్రజానీకానికి సంబంధించినవే. గత సంవత్సరం నవంబర్ నుంచి కరెంటు బిల్లులతోనే జనం తీవ్ర ఆందోళన చెందగా మార్చి నెల బిల్లులు మరింత షాక్ కొడుతున్న పరిస్థితి నెలకొంది. డిసెంబర్ నెలలో ఎఫ్‌పిపిసిఎ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చస్ కాస్ట్ అడ్జస్టెట్మెంట్) ఛార్జీలు రెండు ఉండగా, జనవరిలో నెలలో ఎఫ్‌పిపిసిఎల భారాలు మూడుకు చేరాయి. దీంతో బిల్లులు మోతమోగుతున్న పరిస్థితి నెలకొంది. 2022-23, 2023-24 సంవ త్సరాలకు సంబంధించి విద్యుత్ పంపిణీలో అదనపు ఖర్చుల పేరుతో జనాలపై విద్యుత్ బిల్లుల బాదుడు తారాస్థాయికి చేరింది. విద్యుత్ బిల్లులో సగానికి పైగా అదనపు ఛార్జీల భారమే ఉంటుంది. గత వైసిపి పాలనలో ఏడుసార్లు అదనపు ఛార్జీల భారం వడ్డించగా, కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలలో నవంబర్ నుంచి అదనపు ఛార్జీల భారం మోపింది. తాము అధికా రంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూ అధికారంలోకి వచ్చిన కూటమి సర్కార్ వరుస విద్యుత్ ఛార్జీల వడ్డన సాగిస్తోంది. ప్రస్తుతం ఎండ పెరగడంతో విద్యుత్ వాడకం మరింత ఎక్కువ అవకాశం ఉంది. వచ్చే నెలలో కరెంట్ అదనపు ఛార్జీలతో ఎంత కరెంట్ బిల్లు వస్తుందో అర్థం కాని పరిస్థితుల్లో ప్రజలు ఉన్నారు.




**ఎఫ్‌పిపిసిఎ, ట్రూ అప్ సర్దుబాట్లు**

ఎఫ్‌పిపిసిఎ, ట్రూ అప్ విద్యుత్ ఛార్జీల పేరుతో ప్రభుత్వం జనాలను పీల్చిపిప్పి చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చినట్లే ఇచ్చి ఇతర రూపాల్లో గుంజుకుంటుందున్న చర్చ ప్రజల్లో నెలకొంది. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ఇక నుంచి అదనపు ఛార్జీల భారాన్ని ఏ నెలకు ఆ నెలలో వసూలు చేయాలన్న ఆలోచన సైతం విద్యుత్ శాఖ, ప్రభుత్వం చేస్తున్నట్లు తెలుస్తోంది.

**స్మార్ట్ మీటర్లుతో అధిక బిల్లు**

దుకాణాలకు స్పాట్ మీటర్లు బిగించడం వల్ల అధికం బిల్లు వస్తుంది. పాత మీటర్లు ఉన్నప్పుడు బిల్లు తక్కువ వచ్చేదని స్మార్ట్ మీటర్లు బిగించిన తర్వాత అధిక స్పీడ్ పెరిగి అధిక యూనిట్లు రావడంతో బిల్లు కూడా ఎక్కువగా వస్తుంది. దీనికి తోడు అదనపు ఛార్జీలు మరింత భారంగా మారాయి.

**- దస్తగిరి, వ్యాపారి, పులివెందుల**

**విద్యుత్ వాడకుండానే బిల్లులు ఎక్కువ**

విద్యుత్ వాడకం తక్కువైనా కూడా కరెంటు బిల్లు మాత్రం అధికంగా వస్తుంది. బిల్లు ఎంత వస్తుందో అదనపు ఛార్జీలు అంత కంటే ఎక్కువ వేయడం వల్ల బిల్లు రెట్టింపు అవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం వీటిపై ఆలోచించాలి.

**- ఉమాదేవి, గృహిణి , పులివెందుల**

**భారమవుతున్న విద్యుత్ ఛార్జీలు**

కూలీ పనికి పోయి ఇంటి అద్దె కట్టలేని పరిస్థితి. దీనికి తోడు అధిక విద్యుత్ ఛార్జీలు భారంగా మారుతున్నాయి. ఎక్కువ బిల్లు వచ్చే వారిపై అదనపు ఛార్జీలు విధిస్తే బాగుంటుంది. కానీ తక్కువ బిల్లు వచ్చే వాళ్లపై కూడా విధించడం వల్ల పేదలకు మరింత భారం పడే అవకాశం ఉంది.

**- భవాని, వ్యవసాయ కూలీ, పులివెందుల.**




మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ

## ప్రత్యేక ప్రతిభావంతులు అన్నిరంగాల్లో ముందుండాలి : ఎంఆర్‌పిఎస్

**ప్రజాశక్తి-పీలేరు**

ప్రత్యేక ప్రతిభావంతులు సకలాంగులతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణ తెలిపారు. విహెచ్‌పిఎస్ సీనియర్ నాయకులు రామమోహన్‌రెడ్డి, చిన్న రెడ్డప్ప, సుభహాన్ సమన్వయంలో విహెచ్‌పిఎస్ పీలేరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం బుధవారం ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు పీలేరు నియోజకవర్గ ఎంఎస్‌పి ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ప్రత్యేక ప్రతిభావంతుల కోసం కుల మతాల కతీతంగా అన్ని వర్గాలను కూడగట్టుకుని వారి హక్కులు, పింఛన్ కోసం గతంలో అలుపెరుగని ఉద్యమాలు చేసి, వారికి ప్రత్యేక స్థానాన్ని, రాష్ట్ర ప్రభుత్వం వారికి అందించే పించను పెంపుకు కృషి చేశారని గుర్తు చేశారు. విహెచ్‌పిఎస్ సీనియర్ నాయకులు రామమోహన్‌రెడ్డి మాట్లాడుతూ పదిమంది కోసం సామాజిక ఉద్యమాల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన మహోన్నత వ్యక్తి మందకృష్ణ మాదిగ అని ఆయన స్ఫూర్తితో తాను పీలేరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పర్యటించి ఎంఆర్‌పిఎస్ నాయకుల సహాయ, సహకారాలతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పర్యటిస్తూ విహెచ్‌పిఎస్ నాయకుల సమస్యల పరిష్కార దిశగా ఉద్యమిస్తూ విహెచ్‌పిఎస్ నూతన నాయకత్వాన్ని బలోపేతం చేస్తానని తెలియజేశారు. ఎంఎస్‌పి పీలేరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గండికోట వెంకటేష్ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో గతంలో 2007 సంవత్సరంలో ఎంఆర్‌పిఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ పీలేరు నియోజకవర్గ పరిధిలో ఒంటెద్దు బండ్లపైన ప్రత్యేక ప్రతిభావంతులతో కలిసి పట్టణ పురవీధుల్లో నిరసన ర్యాలీ చేశామన్నారు. అప్పటి రాష్ట్ర రాజధానికి హైదరాబాదుకు పీలేరు నుండి వికలాంగులను అధిక సంఖ్యలో తరలించి బిహెచ్పిఎస్ నాయకత్వానికి అప్పుడే బీజం వేశామని మందకృష్ణ ఆధ్వర్యంలో నూతనంగా మరింత నాయకత్వాన్ని బలోపేతం చేసి పీలేరులో వికలాంగుల సమస్యల పరిష్కార దిశగా పయనిస్తూ నూతన నాయకత్వాన్ని బలోపేతం చేసి, రాష్ట్రంలోనే పీలేరు నాయకత్వాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, ఎంఆర్‌పిఎస్ పీలేరు నియోజకవర్గం కో-ఇన్‌ఛార్జి అమరాల వెంకటరమణ, విహెచ్‌పిఎస్ నాయకులు భాస్కర, అమర్నాథ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, నరసింహులు, రవీందర్ రెడ్డి, ఖాదర్ బాషా, కనకమ్మ, నీరజ, ఎంఆర్‌పిఎస్ పీలేరు మండలం ఇన్చార్జ్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## విభిన్నప్రతిభావంతులకు వీల్‌చైర్స్ పంపిణీ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

విభిన్నప్రతిభావంతుల సంక్షేమమే వెలుగు సంస్థ సంకల్పమని సంస్థ కార్యదర్శి ఎం.ఉదయ్ మోహన్‌రెడ్డి అన్నారు. విభిన్నప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహకారంతో వెలుగు సంస్థలో బుధవారం వినికిడి యంత్రాలను, వీల్ చైర్స్‌ని అందజేశారు. వెల్‌విషర్స్ ఆర్గనైజషన్ సెక్రటరీ గిరీష్ వెలుగు సంస్థకు విచ్చేసి వెలుగు ప్రత్యేక పాఠశాల, వెలుగు వృద్ధాశ్రమాన్ని సందర్శించి, గరుండ సెంటరులోని విభిన్నప్రతిభావంతులు తయారు చేసిన గ్రీటింగ్ కార్డ్సను చూసి వారిని అభినందించి, వాటిని కొనుగోలు చేశారు. అనంతరం తనవంతు సహాయంగా వెలుగు సంస్థ విభిన్నప్రతిభావంతులు, వృద్ధులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. గిరీష్ అభ్యర్థన మేరకు శివాజీ నగర్‌కు చెందిన బధిరుడు సలాది రమణ, రామ్ నగర్‌కు చెందిన రామాచారికి వినికిడి యంత్రాలను అందజేశారు. గుర్రంకొండ మండలం యల్లంపల్లికి చెందిన విభిన్నప్రతిభావంతుడు బి.హరినాథ్‌రెడ్డి, కురబలకోట మండలం సింగన్నగారిపల్లికి చెందిన మంజుల ప్రేమ్ కుమార్‌కు వీల్ చైర్‌లను అందజేశారు. సేవా దృక్పథంతో ఉపకరణాలను అందించిన వెలుగు సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డికి గిరీష్, రమణ, రామాచారి, ఉమా, బి.హరినాథ్ రెడ్డి, చలపతి కృతజ్ఞతలు తెలియజేశారు.




బాలుడికి వీల్‌చైర్ పంపిణీ చేస్తున్న దాత

# 'ఉపాధి' పనులు చేపట్టండి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

ఉపాధి హామీ పనులు చేపట్టాలని, వలసలు నివారించాలంటూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేనందున వ్యవసాయ కూలీలు, పేదలు వలస బాట పట్టారన్నారు. ఇప్పటికే చాలా ఇళ్లకు తాళాలు వేయడంతో గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయ్యాయన్నారు. వ్యవసాయ కూలీలకు జీవించే హక్కును కల్పించిన ఉపాధి హామీ చట్టాన్ని పారదర్శంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు జీవించడమే కష్టమైన ప్రస్తుత కాలంలో ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ కూలీలకు రోజు వేతనం రూ.700 ఇవ్వాలని, ఏడాదికి 200 రోజులు పని కల్పించాలన్నారు. జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా అడిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి పనులు కల్పించి, చేసిన పనికి సకాలంలో వేతనాలు చెల్లించడంతో పాటు పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. రాజకీయ జోక్యాన్ని ముఖ్యంగా అధికార పార్టీ నాయకుల ప్రమేయాన్ని నివారించి, గ్రామాలు వదిలి వెళ్లిన వారిని తిరిగి గ్రామాలకు రప్పించి ఉపాధి పనులు కల్పించాలన్నారు. రాయలసీమ ప్రాంతాల్లో చదువులు పూర్తిచేసుకున్న నిరుద్యోగుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకొని ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. రాయలసీమ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం, వ్యవసాయానికి తాగునీరు, సాగునీరు అందిస్తే పుష్కలంగా పంటలు పండి వలసల నివారణ తగ్గు ముఖం పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కారణాలతో తీసివేసిన ఉద్యోగాలను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, క్షేత్రస్థాయి సిబ్బందిపై కక్ష్య వేధింపులను నివారించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు షేక్ ముబారక్, తిరుమల, చంద్రశేఖర్, మునికాటయ్య, బాలు, కుమారి, లక్ష్మమ్మ, రామప్ప, రెడ్డప్ప, రాకేష్ పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు

# పిల్లలకు నాణ్యమైన భోజనం అందించాలి



అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న విజయ్ ప్రతాప్‌రెడ్డి

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**

అంగన్వాడీ కేంద్రాల్లో రాష్ట్ర ఆహార కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్‌రెడ్డి బుధవారం కురబలకోట మండలంలోని మట్లివారిపల్లి అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్, కెజిబివి స్కూల్, ఎపి మోడల్ స్కూల్, జడ్‌పి హైస్కూల్ ముదివేడు, తంబళ్లపల్లె మండలంలోని కుక్కరాజుపల్లిలోని రేషన్‌షాపు నంబర్ 17, అంగన్వాడీ సెంటర్, సివిల్ సప్లైస్ గోడౌన్, ట్రైబల్ గురుకులం స్కూల్, కెజిబివి స్కూల్, హాస్టల్‌లో తనిఖీలు నిర్వహించి ఆహార నాణ్యత పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు బాల్యం చాలా ముఖ్యమైనదని, చదువు ఎంత ముఖ్యమో ఆహారం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. పౌర సరఫరాల శాఖ ద్వారా పొందే బియ్యం నాణ్యతను పరిశీలించి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్కూల్స్, అంగన్వాడీ, వెల్ఫేర్ హాస్టల్స్‌కు నాణ్యమైన బియ్యంను అందజేస్తున్నాయన్నారు. అన్నం వండేటప్పుడు గంజి వంచవద్దని అత్తెసరు (సరికిసరి) పద్దతిలో అన్నం వండుకోవాలని, ఇలా చేయడం వల్ల ఆహారంలోని పౌష్టికత పుష్కలంగా ఉంటుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పిల్లల ఆరోగ్యంపై దృష్టి సారించి మంచి నిర్ణయాలతో పాలు, గుడ్లు, వంటి అధిక విటమిన్, ప్రోటీన్లు కలిగిన ఆహారాన్ని పిల్లలకు అందిస్తున్నాయన్నారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటే చదువులో ముందడుగు వేస్తారని తెలిపారు. కార్యక్రమములో డిఎస్ఒ రఘురాం, జిల్లా విద్యాశాఖాధికారి, ఐసిడిఎస్ సిడిపిఒ, సేఫ్టీ అధికారి, సాంఘీక, వెనుకబడిన, గిరిజన శాఖ అధికారులు, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులతో పాటు తహశీల్దార్లు, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

**ప్రజాశక్తి-మదనపల్లె:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ని కార్పొరేటర్‌కి ఎక్కువ ఎమ్మెల్యే తక్కువని మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడటం ఆయన దిగజారుడు స్థాయికి నిదర్శనమని జగనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మహేష్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేగా ఎన్నికై 8 నెలల నుంచి అసెంబ్లీకి వెళ్లకుండా రాజ్యాంగాన్ని తూట్లు పొడుస్తూ పులివెందుల ప్రజల నమ్మకాన్ని వాళ్ళ సమస్యలపై అసెంబ్లీలో గళం ఎత్తకుండా అసెంబ్లీకి వెళ్లకుండా పులివెందుల నియోజకవర్గ ప్రజలను మోసం చేస్తున్న జగన్ పవన్ కల్యాణ్‌పైన అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. తల్లిని రాజకీయంగా వాడుకొని సిఎం అయ్యాక పార్టీ నుంచి గెంటేయడం తండ్రి సంపాదించిన ఆస్తిని చెల్లికి ఇవ్వకుండా చేయడం రాష్ట్ర ప్రజలకు తెలీదా అని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో వచ్చిన 11 సీట్లు కూడా రాకుండా మీరు కూడా ఎమ్మెల్యేగా గెలవకుండా మీ రాజకీయ సమాధికి మీరే పునాదులు వేసుకుంటు న్నారన్నారు. పవన్‌పైమాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు.

## ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీ

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ :** పట్టణంలో మంగళవారం ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాలను ఒకటో పట్టణ సిఐ ఎరిషావల్లి ఫ్లయింగ్ స్క్వాడ్‌తో కలిసి తనిఖీ చేశారు. మదనపల్లె పట్టణ కేంద్రంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోటబడి, బాపూజీ మున్సిపల్ ఉన్నత పాఠశాల సెంటర్ల కేంద్రంగా సుమారు 600 మంది విద్యార్థులు ఓపెన్ ఇంటర్ పరీక్షలు రాస్తున్నారు. 3వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కాగా పెద్ద ఎత్తున మాస్ కాపీయింగ్ జరుగుతోందని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాల వద్ద స్లిప్పులు దొరకడంతో వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తెలిసింది. కాగా బుధవారం లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ముఖ్యంగా కోటబడి కేంద్రంగా ఉర్దూ పరీక్షను అభ్యర్థులకు బదులు ఇతరులు పరీక్ష రాస్తున్నారని పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో సిఐ ఎసిసావల్లి, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇన్విజిలేటర్లు సెల్ ఫోన్లను కలిగి ఉండడం గుర్తించారు. విద్యార్థుల హాల్ టిక్కెట్లను పరిశీలించారు.

# సంఘ విద్రోహ శక్తులపై కఠిన చర్యలు : ఎస్‌పి

**ప్రజాశక్తి - రాయచోటి టౌన్**

మతాలను అడ్డం పెట్టుకొని సంఘ విద్రోహ శక్తులుగా చలామణి అవుతామంటే విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు హెచ్చరించారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరిగిన వీరభద్ర స్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా కొన్ని హిందూ సంఘాలు చేరి అనవసర వ్యాఖ్యలు, రెచ్చగొట్టే విధంగా చేశారన్నారు. ముస్లిములు కూడా ఠాణా సర్కిల్ జంక్షన్ వద్ద ఊరేగింపును అడ్డుకోవడంతోపాటు పోలీసులు మమ్మల్ని మోసం చేశారంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారన్నారు. రెండు గ్రూపుల్లోని ఆకతాయిలు మత పెద్దల మాటలు వినకుండా పోలీసులపై సైతం రెచ్చిపోయి దాదాపు వెయ్యి మంది చెప్పులు విసరడం, రాళ్లు రువ్వడం చేశారన్నారు. రెండు గ్రూపులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఘర్షణ పడే సమయంలో డ్రోన్ కెమెరాలతో ఆకతాయిలను గుర్తించామని, స్వల్ప లాఠీఛార్జ్‌లో పోలీసులతో సహా చాలామందికి గాయాలయ్యాయన్నారు. ఈ సంఘటనపై పుకార్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రతి ఏడాది హిందూ, ముస్లిములు కలిసిమెలిసి వీరభద్రస్వామి ఉత్సవాలు, ముస్లిముల పండుగలు జరుపుకుంటూ వచ్చారనీ ఈ మధ్య హిందూ, ముస్లిం మత సంస్థలు ఏర్పాటు చేసుకుని పోరాటాల పేరుతో తమ పబ్బం గడుపుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇలాంటి వారి వల్ల ప్రశాంత వాతావరణానికి భంగం కలుగుతుందన్నారు. వారిపై పీడీ యాక్టులు నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామంటూ హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు

# విద్యార్థులు టీమ్ స్పిరిట్ అలవర్చుకోవాలి

**ప్రజాశక్తి-మదనపల్లె**


విద్యార్థులు జీవితంలో విజయం సాధించాలంటే టీమ్ స్పిరిట్ అలవర్చుకోవాలని మిట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యువరాజ్ అన్నారు. బుధవారం కళాశాలలో అశ్వ 2కె25 జాతీయ స్థాయి టెక్నో కల్చరల్ స్పోర్ట్స్ ఫెస్ట్ విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కలిసి కట్టుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం, వారి సహకారంతో అందరిని ఉత్సాహపరచడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. టీమ్ స్పిరిట్ అనేది ప్రతి విద్యార్థిలోనూ ఎంతో గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. ప్రతి ఒక్కరికీ అభిందనలు తెలియజేశారు. ముఖ్యఅతిథి ఆర్‌ఆర్‌ఆర్ ఎడ్యుకేషనల్ ప్రెసిడెంట్ నాదేళ్ల ద్వారాకనాథ్ మాట్లాడుతూ ప్రతివిద్యార్థి టీమ్ స్పిరిట్‌ను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమాన్ని రెండు రోజుల పాటు కళాశాలలో ఘనంగా జరుపుకోవడం, హీరోయిన్ నేహాశెట్టి, సింగర్స్ దీపు, హారిక, సమీర బర్ద్వాజ్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం విద్యార్థులను అలరింపజేశారన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమం కన్వీనర్ డాక్టర్ కమల్ బాషా, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న నాదేళ్ల ద్వారకనాథ్

## కలికిరి జెఎన్‌టియును
# విశ్వవిద్యాలయం చేయాలి : 'నల్లారి'

**ప్రజాశక్తి-పీలేరు :** పీలేరు నియోజకవర్గంలోని కలికిరి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలకు విశ్వవిద్యా లయ స్థాయికి అభివృద్ధి చేస్తూ అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల ప్రశ్నోత్తరాల సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర విభజనకు ముందు అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి కలికిరికి జెఎన్‌టియు ఇంజి నీరింగ్ కళాశాలను మంజూరు చేసి దాని నిర్మాణం కోసం రూ.650 కోట్ల నిధులు కూడా కేటాయించారన్నారు. ఆ మూడున్నర సంవత్సరాల కాలంలో ఇంచుమించు అన్ని భవనాలు పూర్తి చేశామని, కొంత భాగం భవనాలు పూర్తి కాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టడంతో మిగిలిన పనులు కూడా ఆయన సహకారంతో పూర్తి చేయగలిగామని, తద్వారా కలికిరిలో ప్రతిష్టాత్మక జెఎన్‌టియు కళా శాల సాధ్యమైందని కొనియాడారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయి ఉంటే అమరావతిని వదిలేసినట్టు కలికిరి జెఎన్‌టియు కళాశాలను అసంపూర్తి నిర్మాణాలను వదిలేసేవాడన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మదనపల్లి జిల్లా అవు తుందని వస్తున్న ప్రచారం నేపథ్యంలో కలికిరి జెఎన్‌టియు కళాశాలను యూనివర్సిటీగా మార్చి గుర్తింపు ఇవ్వాలని సభలో విన్నవించారు. ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ప్రసంగం విన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ యువగళం పాదయాత్ర సమయంలో కలికిరి జెఎన్‌టియు గురించి ఎమ్మెల్యే తనతో చర్చించారని ప్రస్తుతం ఆ విధంగా జిల్లాకు ఒక విశ్వవిద్యాలయం ఏర్పాటు ప్రారంభిస్తామని తెలియజేశారు. ప్రభుత్వ, ప్రయివేటు విశ్వవిద్యాలయాలు కలిపి జిల్లాకు ఒకటి ఉండేటట్టు చర్యలు చేపడుతామని ఇందుకోసం ముఖ్యమంత్రితో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని వివరించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న నల్లారి



నీలగిరి చెట్లకు వేలం పాటను నిర్వహిస్తున్న డివిజీబ నాగరాజా

## వేలంపాట ఆదాయం రూ.27.10 లక్షలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

బహిరంగ వేలం పాట ద్వారా తవణం పంచాయితీకి రూ.27.10 లక్షల భారీ ఆదాయం సమకూరినట్లు మదనపల్లి డివిజీబ నాగరాజా అన్నారు. బుధవారం స్థానిక సచివాలయం వద్ద ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డి, ఇఒపిఆర్‌డి చలపతిరావు, ఎ. రమేష్‌బాబు, ఆలవేశుల డిటర్ మదన మోహన్, సర్పంచ్ కె.రెడ్డెప్ప, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి మారెప్ప, టిడిపి నాయకులు రాజన్న, మేష రామకృష్ణతో కలిసి తవణం పంచాయితీ కోమటివాని చెరువు వద్ద ఉన్న నీలగిరి చెట్లకు బహిరంగ వేలం పాటను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని నీలగిరి చెట్లకు వేలం నిర్వహించినట్లు తెలిపారు. వేలంపాటలో మొత్తం 24 మంది పాటదారులు పాల్గొనగా, వేలంపాట పోటాపోటీగా జరిగిందన్నారు. ఎర్రావారిపాలెంకు చెందిన సయ్యద్‌బాషా అత్యధికంగా రూ.27.10లక్షలకు పాటను దక్కించుకున్నారని తెలిపారు. వేలం పాటలోని హెచ్చు పాటదారుడు పూర్తి మొత్తంలో నగదు చెల్లించిన వెంటనే నీలగిరి చెట్లను కోసుకోవడానికి పంచాయతీ ద్వారా అనుమతులను ఇస్తామని తెలిపారు. నీలగిరిచెట్ల వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు కె.రెడ్డెప్ప, సుబ్రమణ్యం, ఎఫ్‌బిఒ దీప, టిడిపి నాయకులు రాజన్న, మేష రామకృష్ణ, శ్రీపతి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న చిన్నమండెం ఎంపిడిఒ శేఖర్ నాయక్

## చెత్త నుంచి సంపద తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-కలకడ

పారిశుధ్యం, చెత్తతో సంపాద తయారుచేయు కేంద్రాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించినట్లు చిన్నమండెం ఎంపిడిఒ శేఖర్‌నాయక్ పేర్కొన్నారు. డిపిఒ మస్తాన్‌వలి, ఎంపిడిఒ అబ్దుల్‌రహీం ఆధ్వర్యంలో మండల కేంద్రమైన కలకడలో సంపద కేంద్రంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని ఇఒపిఆర్‌డి, మండల ప్రధాన కేంద్ర పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు పారిశుధ్యం, చెత్తతో సంపద తయారు చేయు షెడ్ల నిర్వహణపై సిబ్బం దికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం, కలకడ గ్రామంలో సంపద కేంద్రం లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో డిపిఒ, సిసి చెత్తతో సంపద తయా రు చేయు కేంద్రాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి సేకరించిన చెత్తను తప్పనిసరిగా షెడ్‌కు చేర్చి, నిర్వహణను వేగవంతం చేయా లని ఇఒపిఆర్‌డి లు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి డిపిఆర్‌సి టీమ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గృహ లబ్దిదారులతో మాట్లాడుతున్న పిడీ శివయ్య

## అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలు పూర్తిచేయాలి : పీడీ

ప్రజాశక్తి-వీరబల్లె : అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పరిశీలించి పూర్తిచేయాలని హౌసింగ్ పీడీ శివయ్య తెలిపారు. బుధవారం మండల కేంద్రం వీరబల్లిలో లబ్దిదారులతో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణాలను పరిశీలించి పూర్తిచేయాలని హౌసింగ్ సిబ్బందికి తెలియజేశారు. లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు పక్కా గృహాలు నిర్మించాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన స్కీం ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఎన్టీఆర్ 2.0 అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకి ఇళ్లు నిర్మించడానికి సిద్ధంగా ఉందని అన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నూర్జహాన్, ఇఒపిఆర్‌డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల ఆశాజ్యోతి 'పెండ్యాల'

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ఎన్ఎంయు వ్యవస్థాపకులు రాజీవ్ రత్న అవార్డు గ్రహీత కార్మిక ఆశాజ్యోతి పెండ్యాల రామ్మోహన్‌రావు ఆర్‌టిసి కార్మికుల ఆశాజ్యోతి అని కార్మిక సంఘం నాయకులు కొనియాడారు. రామ్మోహన్‌రావు 20వ వర్ధంతి సందర్భంగా బుధవారం డిపో కార్యదర్శి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో డిపో ఆవ ఇలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోనల్ కమిటీ సభ్యులు రామకృష్ణ మాట్లాడుతూ రామ్మోహన్రావు కార్మికుల శ్రేయస్సు కోసం చేసిన సేవ లను కొనియాడారు. రాష్ట్ర అధ్యక్షులు రమణా రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్య దర్శి శ్రీనివాసరావు, రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు శివారెడ్డి ఆయన ఆశయా లను కొన సాగిస్తున్నారని తెలిపారు. డిపో ఆవ రణలో అన్న దానం చేశారు. సూర్య నారాయణ, రాజగోపాల్‌రెడ్డి, బాబయ్య అశోక్, పాల్గొన్నారు.


## ప్రారంభానికి నోచని.. బౌద్ధరామాల పర్యాటక అతిథిగృహం



ముక్తికనుమ వద్ద నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథి గృహం

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని ఆదపూరు ముక్తి కనుమ వద్ద దాదాపు కోటి 30 లక్షల రూపాయలతో నిర్మించిన బౌద్ధారామాల పర్యాటక అతిథి గృహం పూర్తి అయ్యి 8 సంవత్సరాలు అవుతున్నా ఇప్పటి వరకు ప్రారంభానికి నోచు కోలేదు. 2017లో అప్పటి టిడిపి ప్రభుత్వంలో రాష్ట్ర పర్యాటకశాఖ బౌద్ధ రామాల అభివృద్ధి కోసం కోటి 30 లక్షల రూపాయలతో పర్యాటక అతిథి గృహంలో ధ్యాన మందిరం, సమావేశ మందిరం తోపాటు పార్కు, టాయిలెట్ నిర్మాణాలు జరిగాయి. అతిథిగృహంలో ప్రత్యేకంగా బుద్ధ విగ్ర హాన్ని ఏర్పా టు చేశారు. క్రీ.శ. ఒకటవ శతాబ్దానికి చెందిన బౌద్ధారామ స్థూపాలు ముక్తి కనుమలలో ఉన్నాయి.1977 లో అప్పట్లో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు సాగాయి.1979 లో ముక్తి కనుమపై 21 స్థూపాలు బయ ల్పడ్డా యి. అప్పట్లో ప్రభుత్వాలు సరైన ప్రచారాలు నిర్వహించ చకపో వడంతో బౌద్ధ రామాల స్థూపాలకు తగినంత ఆదరణ లభించలేదు. గత ప్రభుత్వాలు బౌద్ధ రామాలపై ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూ రు చేసినా నిర్మాణాలలో అలసత్వం, ప్రజలకు వీటిపై అవగాహన కల్పించక పోవడంతో పర్యాట కులకు ఈ బౌద్ధ రామాలు తెలియక ఇక్కడ అభివృద్ధి జర గలేదు. ఇప్పటికైనా పర్యాటకశాఖ అధికారులు అతిథిగృహం ప్రారంభించి మరిన్ని నిధులతో పర్యాటకులకు బౌద్ధారామాలు ప్రచారానికి వినియోగిస్తే సమీపంలోని సోమనాథ ఆలయం ఉండడంతో తప్పనిసరిగా పర్యాటకులు బౌద్ధ రామాల సందర్శనకు వస్తారని ఈ ప్రాంతం అభివృద్ధి చెందేందుకు వీల వుతుందని స్థానిక ప్రజలు అంటున్నారు. రాయలసీమలో అరుదుగా ఉన్న ఈ బౌద్ధ రామాలను మరింత అభివృద్ధి పరచాల్సిన బాధ్యత పర్యాటకశాఖపై ఉంది.



ముక్తికనుమ వద్ద ఉన్న బౌద్ధ ఆరామాలు

## విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి




మాట్లాడుతున్న ప్రిన్సిపల్ శ్యామలదేవి

ప్రజాశక్తి-రామాపురం

బాలికలు బాగా చదువుకొని తమ లక్ష్యాలను చేరుకోవాలని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ శ్యామలదేవి పేర్కొన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మహిళ వారోత్సవాలలో భాగంగా బుధ వారం ఐదవ రోజు మహిళల కెరియర్, చదువు అనే అంశంపై పాఠశాల లోని బాలికలకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన కెరీర్ లోమనం ఏం కావాలని లక్ష్యాన్ని ఎంచుకొని చదవాలన్నారు. గ్రామాలలో చాలా వరకు ఆడపిల్లలకు చిన్న వయసులోనే పెళ్లిళ్ల చేయాలని ఇంటిలోని వృద్ధులు, పెద్దవారు ఆలోచిస్తుంటారని చిన్న తనం లోనే పెళ్లి చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా చాలా కష్టాలు పడాల్సి వస్తుందని తెలిపారు. గ్రామాలలో ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తు న్నట్లుసమాచారం తెలిస్తే వెంటనే అంగన్వాడీ కార్యకర్తగానీ, గ్రామ సచి వాలయంలోని జిఎంఎస్‌కెలకు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం చేరవేయాలి అన్నారు. అనంతరం బాల్యవిహాలతో కలిగే అనార్థాలపై నాటకీయ రూపంలో ప్రదర్శించారు. కిశోర బాలికలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి వివరించారు. కిషోర్ బాలికల వికాసం పై ప్రతిజ్ఞ బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం బాలికలకు మ్యూజికల్ చైర్స్, లెమన్ స్పూన్ గేమ్ ఆటలాడించి మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాలుసాధించిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు సుజాతరెడ్డి, హుస్సేనమ్మ , జిఎంఎస్‌కె మరియమ్మ, పాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

## ఎస్‌సి, ఎస్‌టిల సమస్యలు పరిష్కరించాలి

- ప్రభుత్వ వైద్యశాలకు దారి కల్పించాలి
- ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని అన్నమయ్య జిల్లావిజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ ఫణికుమార్ అధ్యక్షతన ఎస్‌సి,ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు శ్రీనివాసులు మాట్లాడుతూ గత సమావేశంలో తోటిపల్లి ఎస్‌సి కాలనీలో విద్యుత్ లైన్ క్రిందకు ఉండడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కమిటీ సభ్యుల దృష్టికి తీసుకవెళ్లినా ఇంతవరకు ట్రాన్స్‌కో అధికారులు పరిష్కరించకపోవడంతో భాదాకరమని అన్నారు. దండు బీడు ఇందిరమ్మ కాలనీలో అంగన్వాడీ కేంద్రానికి, ప్రైమరీ స్కూల్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ప్రయివేట్ వ్యక్తి ఆక్రమించుకొని కబ్జా చేశారని కావున ఆ స్థలాన్ని కబ్జాదారుడు నుంచి స్వాధీనం చేసుకోవాలన్నారు. మండలంలోని ఎస్‌సి, ఎస్‌టి గ్రామాలకు శ్మశానవాటికలకు స్థలం కేటాయించి సర్వే స్కెచ్ వేసి, మరల జరిగే సమావేశంలోపు రెవెన్యూ రికార్డులో పొందుపరచాలని కోరారు. కలకడ మండల కేంద్రంలో పశు వైద్యశాలకు వెళ్లే దారిని ఒక ప్రయివేట్ వ్యక్తి ఆక్రమించారని సర్వే చేసి ఆస్పత్రికి వెళ్లేందుకు దారి సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎస్‌సి సంఘాల నాయకులు పాలకుంట నరసింహులు, రెడ్డికిరణ్ మాట్లాడుతూ పాపిరెడ్డిగారిపల్లి ప్రభుత్వ ఆస్పత్రి పక్కన ఎస్‌సి కాలనీకి వెళ్ళుటకు దారి సరిగ్గా లేనందున సిసి రోడ్డు వేయాలని, కలకడ మండల కేంద్రంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని అధికారులను కోరారు. అనంతరం తహశీల్దార్ ఫణికుమార్, ఎంపిడిఒ అబ్దుల్ రహీం మాట్లాడుతూ కమిటీ సభ్యులు తెలిపిన సమస్యలను ఈసారి సమావేశంలోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాగముని, పిఆర్‌ఎఇ సాగర్, ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ నాయక్, ఎస్‌సి సంఘాల నాయకులు జివి.రమణ, రజిని, దామోదరం, ముదివేటి శ్రీనివాసులు, వంగిమల్ల మల్లికార్జున, నటరాజ్, లోకేశ్వర పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ఫణికుమార్

## పిచ్చికుక్క దాడిలో చిన్నారికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వేదశ్రీ

ప్రజాశక్తి-ములకలచెరువు

ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మంగళవారం రాత్రి మొలకలచెరువు మండలం లో జరిగిన ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ములకలచెరువు మండలం, మద్దినాయుని పల్లె పంచాయతీ, బిసయ్యగారిపల్లి కు చెందిన, చంద్రశేఖర్ రెడ్డి కుమార్తె వేదశ్రీ ఇంటి ముందు ఆడుకుంటుండగా ఎక్కడ నుంచినో వచ్చిన ఓ పిచ్చి కుక్క బాలికపై దాడి చేసి తీవ్రంగా గాయ పరిచింది. కుటుంబ గమనించి పిచ్చికుక్క నుంచి బిడ్డను రక్షించి హుటాహుటిన 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించారు. జిల్లా ఆస్పత్రి వైద్యులు చికిత్స అందించి, బాలిక పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు వెళ్లాలని వైద్యులు సూచించారు. కుటుంబీకులు చిన్నారిని తిరుపతికి తరలించారు.

## ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి

ప్రజాశక్తి - ఖాజీపేట : మండల పరిధిలోని కడప-కర్నూలు జాతీయ రహదారి భూమాయపల్లె వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాటి నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎపి రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఎవి రమణ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని భూమా యపల్లె హైవేపై ఆయన ప్రజలతో కలిసి ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు గురి కావాల్సి వస్తోందన్నారు. రాత్రి సమయాల్లో విద్యుత్ దీపాలు లేక పోవడం వంటి సమస్యలతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. వెంటనే జాతీయ రహదారి భద్రత విభాగ అధికారులు చర్యలు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భూమాయపల్లి నుంచి శాంతి నగరం, మూలవారిపల్లి, ముత్తులూరుపాడు గ్రామాల ప్రజలు నిత్యం వేలది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. ఆ మేరకు జాతీయ రహదారి విభాగ అధికారులకు వినతిపత్రం అందజేయనున్నామన్నారు.

## మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మహిళల రక్షణకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎస్ఐ తులసి నాగప్రసాద్ పేర్కొన్నారు. సింహాద్రిపురం జడ్‌పి హైస్కూల్, శ్రీ వివేకానంద పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఈనెల 8న అంతర్జాతీయ దినోత్సవం పురస్కరించుకుని చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు మొబైల్ వాడే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో శ్రీవివేకానంద పాఠశాల కరస్పాండెంట్ ఖాదర్‌వలి, జిల్లా పరిషత్ హైస్కూల్ ఉమామహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





టిబి వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

## టిబి అంతం.. మనం పంతం

ప్రజాశక్తి-కలికిరి

టిబి వ్యాధి అంతం మనం పంతం అని ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ, టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు టిబి వ్యాధి అవగాహనా మాసో త్సవాలలో భాగంగా మండలంలోని మెడికుర్తి జడ్‌పి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుచ రెండు వారాలకు పైబడి దగ్గు, రోజు రాత్రి పూట జ్వరం రావడం, ఛాతి లో నొప్పి, గస, ఆయాసం, నీరసం, బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం, గళ్ళ పడటం, రక్తం చుక్కలు గళ్ళ లో కనిపించడం వంటి లక్షణాలు ఉంటే టిబి వ్యాధి అని అనుమానించి ఆశాకార్యకర్త ను సంప్రదించి ప్రభుత్వ అస్పత్రి లో గళ్ళ పరీక్షలు చేయించాలని తెలిపారు. టిబి వ్యాధి ఒకరి నుంచి మరొకరికి నోటి తుంపరలు ద్వారా వ్యాపిస్తుందని అన్నారు. ఒకవేళ వ్యాధి ఉందని నిర్ధారణ ఐతే ఆరు నెలలు మందులు డాట్స్ ఆధ్వర్యంలో తినాలి అని, చికిత్స కాలంలో రోగికి ప్రధానమంత్రి పోషణ అభియాన్ పథకం కింద వెయ్యి రూపాయలు వారి ఖాతా లో మంచి పౌష్టికాహారం తీసుకోవడానికి జమ చేస్తారని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో హెచ్ఎం జాకీర్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న వెంకట్రామిరెడ్డి, గ్రామస్తులు

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

ప్రజాశక్తి-రామాపురం

గ్రామాలలో తాగునీటి సమస్య రాకుండా గ్రామ నాయకులు పరిశీలించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించినట్లు లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దివేవులరమేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లిలో బుధవారం తాగునీటి కోసం వేసిన బోరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆయన సోదరుడు నియోజవర్గం లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు ఓబుల్‌రెడ్డిగారిపల్లిలో ఎంఎల్.వెంకట్రామిరెడ్డి తాగునీటి కోసం బోరు వేయించి గ్రామ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేయడం సంతోష దాయకమని అన్నారు. కార్యక్రమంలో గడికోట ఆంజనేయరెడ్డి చంద్రహాస్‌రెడ్డి ప్రసాద్‌రెడ్డి భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మల్లశంకరయ్య పాల్గొన్నారు.



శ్మశాన వాటికలో చదును చేస్తున్న జెసిబి

## శ్మశాన వాటిక నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పెద్ద కారంపల్లి పంచాయతీలో గత ప్రభుత్వంలో మంజూరైన ముస్లిము స్మశాన వాటికకు సంబంధించిన ప్రహరీ నిర్మాణ పనులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి సహకారంతో ఎంపీ నిధుల నుంచి రూ.10 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం కొరకు నిధులు మంజూరయ్యాయని బరియల్ గ్రౌండ్ డెవలప్మెంట్ కమిటీ అధ్యక్షులు జాహిద్‌అలీ తెలిపారు. బుధవారం ప్రారంభమైన ప్రహరీ నిర్మాణ పనులను ఎపిఎస్‌సిఆర్‌ఐసి ఎఇ ప్రశాంత్ పర్య వేక్షించారు. ఈ సందర్భంగా జాహిద్‌అలీ మాట్లాడుతూ ముస్లిము శ్మశాన వాటిక సంరక్షణకు కృషిచేసిన ఎంపీ మేడా రఘునాథరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఒలంపియాడ్‌లో 'నలంద' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

జాతీయ స్థాయిలో సైన్స్ ఒలంపియాడ్‌లో స్థానిక ఇ టెక్నో నలంద పాఠశాల విద్యార్థులు 15 మంది బంగారు పతకాలు సాధించారని కరస్పాండెంట్ బి.సోమేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. సైన్స్ ఒలంపియాడ్ పరీక్షలో పాల్గొనడం వల్ల విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెరుగుతుందని ప్రిన్సిపల్ బి.వెంకటస్వామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సి.విజిత, ఇ.సర్వేశ్వర్‌రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

## క్రైం కార్నర్

### రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



శశికుమార్ నాయుడు(ఫైల్ ఫొటో)

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన బుధవారం మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె పట్టణం రెడ్డీస్ కాలనీకి చెందిన రాజన్ననాయుడు కుమారుడు దద్దాల శశికుమార్‌నాయుడు(32) స్థానికంగా ఉన్న ఓ ప్రయివేట్ కాలేజీలో పని చేస్తున్నాడు. ద్విచక్రవా హనంలో తన స్నేహి తుడుని పుంగనూరులో వదిలి మదనపల్లెకు బయల్దేరాడు. మార్గమధ్యంలోని బసిని కొండ వద్ద టిప్పర్ ఢీ కొనడంతో తీవ్రంగా గాయ పడ్డాడు. గమనించిన స్థానికులు 108లో బాధితుడిని స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. పరీక్షించిన వైద్యులుఅప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ కళా వెంకట్రమణ తెలిపారు.

### ఇద్దరు నాటుసారా నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-పీలేరు

నాటు సారాతో సహా ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు పీలేరు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. బుధవారం తమకు అందిన సమాచారం మేరకు..మండలంలోని జాండ్ల పంచాయతీ, పచారమాకులపల్లి తండా సమీపంలో తాను తన సిబ్బందితో కలిసి దాడి చేశామని తెలిపారు. అదే గ్రామానికి చెందిన రమేష్ నాయక్, అతని కుమారుడు శివకుమార్ నాయక్ ఇద్దరు కలిసి మోటార్ సైకిల్ లో నాటుసారా ప్యాకెట్లను తరలిస్తుండగా వాహనంతో సహా అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. నాటు సారా తయారు చేయడం, విక్రయించడం, రవాణా చేయడం, కలిగి ఉండడం, సేవించడం వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.